ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 17.12.2025 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ్ము వార్షిక శీతాకాల విడిది కోసం ఈ మధ్యాహ్నం హైదరాబాద్ చేరుకుంటారు.

2. రాష్ట్రంలో చివరి , మూడవ విడత పంచాయతీ ఎన్నికలు కొద్ది సేపటి క్రితం ముగిశాయి. క్యూలైన్లో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు.

3. తెలంగాణలో రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులను వేగంగా పూర్తి చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ను కోరినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

4. రాష్ట్రంలో 105 నియోజకవర్గాల్లో తలపెట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం కోసం సమీకరించే రుణాలను FRBM నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు.

**రాష్ట్రపతి:**

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వార్షిక శీతాకాల విడిది కోసం ఈ రోజు మధ్యాహ్నం రాష్ట్రానికి చేరుకోనున్నారు. రాష్ట్రపతి ఈరోజు నుంచి ఈనెల 22 వరకు సికింద్రాబాద్ , బొల్లారం లోని రాష్ట్రపతి నిలయంలో విడిది చేస్తారు. వార్షిక శీతాకాల విడిదికి రాష్ట్రపతికి ఘనంగా స్వాగతం పలికేందుకు రాష్ట్ర యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. పలు రంగాల ప్రముఖులను కలుసుకుంటారు. హైదరాబాద్ సమీపంలోని ఫిలిం సిటీలో ఈ నెల ఎల్లుండి జరిగే రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ ల సదస్సును రాష్ట్రపతి ప్రారంభిస్తారు. అలాగే, గచ్చిబౌలీ లోని బ్రహ్మ కుమారీస్ సంస్థ ఆడిటోరియమ్ లో ఈనెల 20 న – భారతీయ విజ్ఞానం-శాంతి మార్గాలు, ప్రగతి అనే అంశంపై జరిగే కార్యక్రమంలో రాష్ట్రపతి పాల్గొంటారు. అలాగే , ఈనెల 21 న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోమ్ లో పాల్గొంటారు.

ఎంఎస్ఎల్

**మూడో దశ పోలింగు:**

తెలంగాణలో, చివరి, మూడో విడత పంచాయితీ ఎన్నికలు ముగిశాయి. మధ్యాహ్నం ఒంటిగంటతో పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఈరోజు జరిగిన మూడో విడత పోలింగ్ లో 3 వేల 752 గ్రామ పంచాయతీలు , 28 వేల 410 వార్డులకు ఎన్నికలు జరిగాయి. 53 లక్షల ఆరు వేల మంది పైగా ఓటర్లు 36 వేల 483 పోలింగ్ కేంద్రాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సర్పంచ్ పదవికి 12 వేల 652 మంది అభ్యర్థులు, వార్డు సభ్యుల స్థానాలకు 75 వేల 725 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈ పోలింగ్ ప్రక్రియ బ్యాలెట్ పద్దతిలో జరిగింది. మధ్యాహ్నం 2 గంటలకు ఓట్ల లెక్కింపును చేబడతారు. సాయంత్రానికి ఫలితాలు వెల్లడించి ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. రాష్ట్ర ఎన్నికల సంఘం 77 వేల మందికి పైగా పోలింగ్ సిబ్బందిని ఎన్నికల విధుల్లో నియమించింది. కాగా, ఈ విడతలో 394 గ్రామ పంచాయతీలు , 7 వేల 908 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. 11 గ్రామ పంచాయతీలు , 116 వార్డులలో నామినేషన్లు దాఖలు కాలేదు. మరో రెండు పంచాయితీలు, 18 వార్డు సభ్యుల ఎన్నిక నిలిచిపోయింది.

----MSL

**పోలింగ్**

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో చివరి విడత పోలింగ్  సందర్భంగా ఉదయం నుంచే క్యూ లైన్లలో ఓటర్లు బారులు తీరడం కనిపించింది. ఆయా జిల్లాల్లో పోలింగ్ పనితీరును జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించారు. అధికారులు చివరగా ప్రకటించిన వివరాల ప్రకారం ఉదయం 11 గంటల వరకు 57.91 శాతం పోలింగ్ నమోదయ్యింది. ఒంటి గంట వరకు క్యూ లైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. క్యూలైన్లలో ఉన్నవారికి పలు జిల్లాల్లో ప్రత్యేకంగా టోకెన్లు జారీచేసి ఓటు వేసే అవకాశం ఇస్తున్నారు.

డెస్క్

**కిషన్ రెడ్డి**

తెలంగాణలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులపై రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌తో సమీక్షించినట్లు కేంద్ర బొగ్గు     ,  గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఆయన ఢిల్లీలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణలో ఆధునికీకరిస్తున్న 42 రైల్వేస్టేషన్ల పనులు వేగవంతం చేయాలని రైల్వే మంత్రిని కోరినట్లు చెప్పారు. కొమురవెల్లి మల్లన్న రైల్వేస్టేషన్ నిర్మాణం ఇప్పటికే 95 శాతం

పూర్తయిందని,  మిగిలింది సాధ్యమైనంత తర్వగా పూర్తి చేసి భక్తులకు అంకితం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి యాదగిరిగుట్ట వరకు 400 కోట్ల రూపాయలతో చేపట్టాల్సిన ఎంఎంటీఎస్ రెండోదశ నెట్‌వర్క్ గురించీ చర్చించినట్లు వెల్లడించారు.

డెస్క్

**రేవంత్**

రాష్ట్రంలో 105 నియోజకవర్గాల్లో నిర్మించబోయే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు , ఉన్నత విద్యా సంస్థల్లో మౌలిక వసతుల కల్పన కోసం తెలంగాణ ప్రభుత్వం సమీకరించబోయే 30 వేల కోట్ల రూపాయల రుణాలను ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. పార్లమెంటు భవన్‌లో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్ , ధర్మేంద్ర ప్రధాన్‌లను కలిసి విద్యారంగానికి సంబంధించిన కీలక అంశాలపై ముఖ్యమంత్రి చర్చించారు.

డెస్క్

**ఆహ్వానం**

ఢిల్లీలో యశోభూమి వేదికగా ఈనెల 19 , 20 తేదీల్లో నిర్వహించనున్న చింతన్ శిబిరం-2025కు హాజరు కావాలని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖ

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి కేంద్రం నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆహ్వాన లేఖను మంత్రికి పంపించారు. ఈ చింతన్ శిబిరం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేస్తుందని , జాతీయ చింతన్ శిబిరంలో తెలంగాణ చురుకైన పాత్ర పోషిస్తుందని మంత్రి కోమటిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డెస్క్

**కుష్టు**

జాతీయ కుష్టు నివారణ కార్యక్రమంలో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా రేపటి నుండి ఈనెలాఖరు వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రజిత చెప్పారు. ఆకాశవాణితో ఆమె మాట్లాడుతూ... సర్వే కోసం వచ్చే వైద్య సిబ్బందికి ప్రజలు సహకరించాలన్నారు.

బైట్ - రజిత

పిటిసి, సిరిసిల్ల

**కోటా**

రామగుండం ఎరువుల కర్మాగారం (ఆర్ఎఫ్‌సీఎల్)లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో 70 శాతం తెలంగాణకే కేటాయించాలని రాష్ట్ర

వ్యవసాయ, పరిశ్రమల శాఖల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు ,
శ్రీధర్‌బాబు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు లేఖ రాయాలని
పరిశ్రమలశాఖ అధికారులను ఆదేశించారు. ఆర్‌ఎఫ్‌సీఎల్ పైన,
బుగ్గపాడు మెగా ఫుడ్ పార్క్ పైన సచివాలయంలో నిన్న మంత్రులు
సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..
ఆర్‌ఎఫ్‌సీఎల్ లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో 50 శాతమే
తెలంగాణకు కేటాయిస్తున్నారని, మరో 20% కలిపి రాష్ట్రానికి ఇవ్వాలని
అన్నారు.

డెస్క్

**జూపల్లి**

54వ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని హైదరాబాద్‌లోని చారిత్రక
గోల్కొండ కోటలో నిన్న రాత్రి నిర్వహించిన వేడుకల్లో పర్యాటక ,
సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. 1971
యుద్ధంలో దేశానికి చారిత్రక విజయాన్ని అందించిన వీర సైనికుల
ధైర్యం, త్యాగాలను ఆయన స్మరించుకున్నారు. 13 రోజుల్లోనే భారత
సాయుధ దళాలు సాధించిన విజయం ప్రపంచ చరిత్రలో గర్వకారణమని
మంత్రి పేర్కొన్నారు. సైనికుల వీరత్వం తరతరాలకు స్ఫూర్తినిస్తుందని

అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైనిక అధికారులు , రాష్ట్ర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జీఎస్

**బీజేపీ**

జీహెచ్ఎంసీ డిలిమిటేషన్ డ్రాఫ్ట్‌పై భారతీయ జనతాపార్టీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రక్రియను ఏకపక్షంగా, ఆదరాబాదరాగా చేపట్టిందని.. బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు. డివిజన్లలో ఓటర్ల సంఖ్య , వైశాల్యం, రేడియస్ పరంగా తీవ్ర అసమానతలు ఉన్నాయని , ఓల్డ్ సిటీ, న్యూ సిటీ, విలీన ప్రాంతాల్లో మూడు రకాల ప్రమాణాలు పాటిస్తున్నారని విమర్శించారు. ప్రజా ప్రతినిధులతో చర్చ లేకుండా , అఖిలపక్ష సమావేశం నిర్వహించకుండానే నిర్ణయాలు తీసుకున్నారని , ఇది ప్రజల జీవితాలతో చెలగాటమని బీజేపీ ఆరోపించింది. ఈ అంశంపై రాజకీయంగా, న్యాయపరంగా, అవసరమైతే ప్రజా ఉద్యమం కూడా చేపడతామని ప్రభాకర్ స్పష్టం చేశారు.

పీఎస్

**ఆందోళన**

మహబూబాబాద్ జిల్లాకు మంజూరైన రైల్వే పీరియాడికల్ ఓవర్ హోలింగ్ , రెగ్యులర్ ఓవర్ హోలింగ్ మెగా మెయింటెనెన్స్ డిపో ను మరో ప్రాంతానికి తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అఖిల పక్ష , ఐక్య విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. ఈరోజు జిల్లాకేంద్రంలో మానవహారంతో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల పక్ష ఐక్య విద్యార్థి సంఘాల కన్వీనర్ డోలి సత్యనారాయణ మాట్లాడుతూ...

సౌండ్ బైట్

పిటిసి, మహబూబాబాద్

**ఐ పి ఎల్**

కరీంనగర్ జిల్లా నుండి మొట్ట మొదటి సారిగా ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ కు కరీంనగర్ నగరానికి చెందిన పేరాల అమన్ రావు ఎంపికయ్యాడు. ఇది హర్షనీయమని మాజీ క్రికెట్ క్రీడా కారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేరాల అమన్ రావు ఇప్పటికే హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ , అండర్ 19, అండర్ 23 లో చాలా గొప్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారని అన్నారు.

పిటిసి, కరీంనగర్

**నిఫ్ట్**

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ – NIFT 2026 విద్యాసంవత్సరానికి ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేసింది. అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల కోసం ప్రవేశ పరీక్ష కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చేనెల 6వ తేదీ వరకు చేయవచ్చని , ఆలస్య రుసుముతో జనవరి 10వ తేదీ వరకు అవకాశం ఉందని ఒక ప్రకటనలో వెల్లడించింది.

పీఎస్

**ఆత్మహత్యాయత్నం**

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలంలోని పెదరాస్ పల్లి గ్రామ సర్పంచ్ గా పోటీ చేస్తున్న బొమ్మెల రాజన్న ఈరోజు ఉదయం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు గమనించి కాగజ్ నగర్ పట్టణంలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు.

పిటిసి, ఆసిఫాబాద్

ఉష్ణోగ్రతల తగ్గుదల

ఆసిఫాబాద్ జిల్లాలో చలితీవ్రత మరింత పెరిగింది. గడిచిన 24 గంటల్లో సిర్పూర్ (యూ)లో అత్యల్పంగా 7.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా , 3 మండలాల్లో తొమ్మిది డిగ్రీల కంటే తక్కువగా ఉష్ణోగ్రత నమోదయింది.

పిటిసి, ఆసిఫాబాద్